క్లుప్తంగా

మంత్రికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఆయన సోదరుడైన డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారు గురువారం హైదరాబాదులోని మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి పూలమాలలతో సన్మానించారు.

వీధి లైట్ల కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్డు నెం-7లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఇంద్రానగర్‌కాలనీ మీదగా కొల్లూర్ రింగ్‌రోడ్డు వరకు అభివృద్ధి చేసిన రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో మాణిక్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కన్వీనర్‌గా జగన్నాథ్



జహీరాబాద్ టౌన్: నియోజవర్గం బీజేపీ కన్వీనర్‌గా నాబాద్ జగన్నాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మొగుడంపల్లి మండలం ధనసరి గ్రామానికి చెందిన జగన్నాథ్ ఏబీవీపీలో పనిచేసి ఆ తరువాత బీజేపీలో చేరారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతుల కారణంగా న్యాల్‌కల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారి రఘునాథ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా నల్లపోచమ్మ జాతర



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: మనూరు మండలంలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో ఉత్సవాలు రెండో వారం వైభవంగా కొనసాగాయి. గురువారం అమ్మవారికి అర్చకులు శ్రీకాంత్ స్వామి, నగేశ్ స్వామి, సిద్ధుస్వామి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాలనుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని.. బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయని న్యాల్‌కల్ పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ముజీబ్ తెలిపారు. 24 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు మొదటి సంవత్సరానికి 360మంది, ద్వితీయ సంవత్సరానికి 158 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సర్కారీ చదువులే భేష్..

ఇంటర్మీడియెట్‌లో ఈ యేడాది ప్రవేశాలకు తొలివిడత ప్రక్రియ ప్రారంభమైంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచడానికి ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు దృష్టి సారించాలని ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అందులో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి సర్కారు కాలేజీలలో చేరేలా అధ్యాపకులు ప్రచారబాట పట్టారు.

– నారాయణఖేడ్:

- ప్రభుత్వ కళాశాలలకు రండి
- అధ్యాపకుల ప్రచార బాట
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు
- 1వ తేదీ నుంచి తరగతులు

ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధన తీరు, అందుతున్న వసతులు తదితర అంశాలను వివరించి ప్రవేశాలు పొందేలా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ప్రవేశాల సంఖ్య పెంచాలని ప్రిన్సిపాల్స్‌కు దిశానిర్దేశం చేశారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియలో భాగంగా ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా అధ్యాపకులు నేరుగా విద్యార్థుల ఇళ్లకే వెళ్లి తమ పిల్లలను కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం ప్రైవేటు కళాశాలలకే పరిమితంకాగా గత యేడాది నుంచి ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులూ అవలంబించారు. ఈ ఏడాది ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టి విద్యార్థుల ప్రవేశాలను పెంచాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. జూన్ 1 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించనున్నారు.



నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



ప్రచార కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఇవీ.. వసతులు

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 141 ఉండగా అందులో 131 మాత్రమే కొనసాగుతున్నాయి. వాటిలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 18,753 మంది, రెండో సంవత్సరంలో 18,521 మందితో మొత్తం 37,274 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులకు వెళ్లనున్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచితంగా పుస్తకాలు అందజేస్తారు. పరీక్ష ఫీజులు మినహా మిగతా రుసుములేవీ ఉండవు. నిపుణులైన అధ్యాపకులతో బోధనతోపాటు విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానాలు ఉంటాయి.

ఉత్తమ ర్యాంకులు

ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులే సొంతం చేసుకుంటున్నారు. నాలుగైదేళ్లుగా ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ కళాశాలల కంటే ధీటుగా మారాయి. దీంతో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చిన విద్యార్థులు సర్కారు కళాశాలలకు క్యూ కడుతున్నారు. అధ్యాపకుల ప్రచారం అందుకు బాగా ఉపయోగపడుతోంది. ఖేడ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ ఏడాది రాష్ట్రస్థాయి, జహీరాబాద్ కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి ర్యాంకులను సాధించిన విషయం తెలిసిందే.

“ ప్రచారం ప్రారంభం



జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రచారం ప్రారంభించాం. అత్యుత్తమ ఫలితాలు ప్రభుత్వ కాలేజీల్లోనే వస్తున్నాయి. చాలా మంది విద్యార్థులు కూడా సర్కారు కళాశాలల్లోనే చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. నెలాఖరుకు అడ్మిషన్ల ప్రక్రియ మొదటి విడత పూర్తిచేసి జూన్ 1నుంచి తరగతులు ప్రారంభిస్తాం.

– కళింగ కృష్ణకుమార్, రాష్ట్ర ప్రిన్సిపాల్స్ సంఘం ప్రధాన కార్యదర్శి

తామర పుష్పాలతో అర్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనం కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారికి తామర పుష్పాలతో అర్చన, రుణ విమోచన నరసింహ హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం, కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- సివిల్ సప్లయ్ డీఎం కొండల్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లయ్ అధికారులు సందర్శించారు. ఆ శాఖ డీఎం కొండల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ తేజశ్విని, తహసీల్దార్ భిక్షపతి గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు మాట్లాడుతూ రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, ఎలాంటి ధాన్యం ఉన్నా తప్పక కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని 132 సర్వేనంబర్‌లోని కుడికుంటలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సాయికిరణ్, ఇతర నాయకులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు శిఖం భూముల్లో షెడ్డులను వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రక్తదానం చేయడం అలవాటుగా మారాలి



రక్తదానం చేస్తున్న బీడీఎల్ ఉద్యోగులు

- బీడీఎల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

పటాన్‌చెరు టౌన్: రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని బీడీఎల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం పటాన్‌చెరు మండలం భానూర్ బీడీఎల్ కమ్యూనిటీ హాల్‌లో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 74మంది పాల్గొని రక్తదానం చేశారని చెప్పారు. గత దశాబ్ద కాలంగా బీడీఎల్ ఉద్యోగులు సోషల్ ఆర్గనైజేషన్, విన్నర్స్ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేసి ఎందరో చిన్నారులను ఆదుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రఘు, జీవరత్నం, యాదగిరి గౌడ్, రమేశ్, సదానందం, రమేశ్, మల్లేశ్, జయపాల్, శ్రీకాంత్, సృజన్, నాయుడు, కామేశ్ పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట దుర్గానగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఆదినారాయణరావు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు అతడి కొడుకు మణికంఠ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ మల్లయ్య కథనం ప్రకారం.. అతను పనిచేసిన చోట ఇన్‌కమ్ టాక్స్‌కి సంబంధించిన గొడవలు ఉండడంతో ఓనర్లకు చెప్పినా పట్టించుకోవడంలేదని కుటుంబ సభ్యుల వద్ద వాపోయాడు. బుధవారం సాయంత్రం లెటర్‌రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆదినారాయణ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

చేగుంట(తూప్రాన్): స్థానిక మోడల్ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రశంసాపత్రాలను అందించినట్లు ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు. 9.5పైగా జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు.

ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

హుస్నాబాద్: గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ఆకుల రజిత అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గౌడ కులస్తులు అమ్మవారికి బాషికాలు కట్టారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పంబాల పూజారులు ఎల్లమ్మ తల్లి కథలు చెప్పి భక్తులను ఆకట్టుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు బోనాలు, ఒడిబియ్యం, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ ఎక్బాల్‌హుస్సేన్

రాయికోడ్(అందోల్): మండలంలోని సిరూర్ గ్రామ శివారులోని మంజీరానది బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఏఎస్‌ఐ ఎక్బాల్ హుస్సేన్ తెలిపారు. నదిలో మృతదేహాన్ని గమనించిన సిరూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. 30నుంచి 45ఏళ్ల వయసు ఉంటుందని, 5రోజుల క్రితం చనిపోయి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. విచారణ జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామానికి చెందిన అంతయ్య(56) మేకలు మేపుతూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మేకలు మేపేందుకు గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం గ్రామ శివారులోని పంట పొలాల వద్ద వెతికారు. ఓ పొలం వద్ద పక్కనే ఉన్న వాగులో మృతదేహాన్ని గమనించారు. వాగు పక్కనే విద్యుత్ వైర్లు కిందికి ఉండటంతో విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి వివరించారు.

లారీలను ఆపి రైతుల నిరసన

- ధాన్యం తరలించాలని వేడుకోలు

పుల్‌కల్(అందోల్): తమ ధాన్యం రవాణా చేయాలంటూ పలువురు రైతులు రోడ్డుపై వెళుతున్న లారీలను ఆపి నిరసన తెలిపారు. మండల పరిధిలోని ఇసోజిపేట రైతులకు నాలుగైదు రోజులుగా లారీలు రాకపోవడంతో ధాన్యం బస్తాలు రోడ్డుపైనే ఉండిపోయాయి. వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందిన రైతులు గురువారం నిరసనకు దిగారు. దీంతో ముదిమాణిక్యం గ్రామంలో సుద్ద ఘు రవాణా చేయడానికి వెళుతున్న లారీలను ఆపి ధాన్యం తరలించాలని పట్టు బట్టారు. తాము సుద్దను మాత్రమే తరలిస్తామని, ధాన్యం బస్తాలు రవాణా చేయలేమని డ్రైవర్లు తెలిపారు. అయినా రైతులు లారీలను అడ్డుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న పుల్‌కల్ పోలీసులు, సంగారెడ్డి రవాణాశాఖ అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు సముదాయించి సుద్ద లారీలను పంపించారు. ధాన్యం రవాణాకు అదనపు లారీలను పంపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

సంక్షిప్త వార్తలు

◆ కూలీలకు పని కల్పించాలి

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేస్తామన్న కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్లకు గురువారం సూచించారు. వందశాతం మంది కూలీలకు పని కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కొలత ప్రకారం కూలి మంజూరు చేస్తామన్నారు.

◆ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆయా గ్రామాల్లో దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెద్దలోడి గ్రామంలో బసవేశ్వర దేవాలయంలో రెండు నంది విగ్రహాలతోపాటు దత్తాత్రేయ స్వామి, అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర రుక్మాబాయి దేవతామూర్తులకు గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ సాయిబాబాకు అభిషేకాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇశ్రితాబాద్ శివారులోగల సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సాయిబాబా విగ్రహానికి పంచామృత అభిషేకం, పుష్పాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వెంకటాపూర్ శివారులోని వెంకటాచల దివ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి పద్మావతి గోదా సమేత అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం తెలిపారు. 24న స్వామివారికి అభిషేకం, అంకురారోహణం, 25న ధ్వజారోహణం, చంద్రప్రభవాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం ,26న శ్రీవారి కల్యాణోత్సవం, రథోత్సవం, 27న సుదర్శన నరసింహ హవనం, చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

◆ ఆలయంలో భక్తుల సందడి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిబాబా మందిరంలో భక్తుల సందడి నెలకుంది. గురువారం పౌర్ణమికావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఉదయం 5గంటల నుంచి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం షిర్డి తరహాలో శేజ్ హారతి నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం వితరణ చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు

- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో జనం బేజార్
- పనులు వేగవంతం చేయాలని వాహనదారుల విజ్ఞప్తి

రామచంద్రాపురం పట్టణంలోని జ్యోతినగర్ కాలనీ నుంచి శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్ వరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గం గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండటంతో గత ప్రభుత్వ హయాంలో 2022 అక్టోబర్‌లో ఫ్లైఓవర్‌ను నిర్మించేందుకు రూ.130కోట్ల నిధులను మంజూరు చేశారు. నిధులు మంజూరైన 2022 అక్టోబర్‌లో ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సైతం ప్రారంభించారు. కానీ.. నేటికీ పూర్తి చేయకపోవడంతో వాహనదారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

ఈ ప్రాజెక్టును రెండేళ్లల్లో పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణ పనులు ప్రారంభించిన సమయంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పక్కనే మరో రోడ్డును అభివృద్ధి చేసినా ప్రయోజనం లేకపోగా ఫ్లైఓవర్ పనులు నతకడకన కొనసాగుతూ వస్తున్నాయి. ముంబై జాతీయ రహదారి కావడంతో బస్సులు, భారీ వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఈ మార్గంలో ప్రధానంగా ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.



లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ జామ్

రాంగ్‌రూట్‌లో ప్రయాణం

ఫ్లైఓవర్ కారణంగా వాటి నుంచి వచ్చే దుమ్ముతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగంపల్లి చౌరస్తా వద్ద వన్‌వే చేయడంతో బెల్ కాలనీ నుంచి వాహనాదారులు అర కిలోమీటరు దూరంలోని యుటర్నింగ్ వద్దకు వెళ్లకుండా వాహనాలపై రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం గంటల తరబడి వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నారు. ఇక వర్షాలు పడిన సమయంలో అయితే నరకయాతన పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

పిల్లర్ల దశలోనే పనులు

చందానగర్, లింగంపల్లి చౌరస్తాలలో ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా పిల్లర్లను నిర్మిస్తున్నారు. పిల్లర్లు పూర్తయిన వెంటనే వాటిపై గార్డర్లను ఎక్కిస్తారు. అయితే పనులను సకాలంలో పూర్తవుతాయా లేవా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

“ ఇబ్బందులు తప్పడం లేదు



జ్యోతినగర్ కాలనీ నుంచి శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్ వరకు ట్రాఫిక్ జామ్ అవుతోంది. నిత్యం ఈ మార్గంలో ప్రమాణం కొనసాగించాలంటే ఇబ్బందికరంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. పనులను త్వరగా పూర్తి చేయాలి.

– అల్తాఫ్, బీహెచ్‌ఈఎల్ వాసి

పనులు పూర్తి చేస్తాం

ఫ్లైఓవర్ నిర్మాణం పనులను ఈ ఏడాది అక్టోబర్ వరకు పూర్తి చేస్తాం. వాహనదారులు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అధికారుల సమన్వయంతో పనులను త్వరగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటాం

– రామకృష్ణ, డీఈ, ఆర్‌అండ్‌బీ ”